# విశాల భారతి

తెలుగు దినపత్రిక

27-03-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 82







## సీనియార్టీకి విలువేది సీఎం

- కాంగ్రెస్ సీనియర్ నేత టీ. జీవన్ రెడ్డి రాజీనామా నిర్ణయం సంచలనం
- దశాబ్దాలుగా పార్టీకి సేవ చేసినా విలువ లేదని ఆవేదన
- సొంత నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలపై అసంతృప్తి
- కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై ఆగ్రహం
- మినేటెడ్ పోస్టుల భర్తీలో తన వర్గానికి అన్యాయం
- కాంగ్రెస్‌లో పాత, కొత్త నేతల మధ్య సమన్వయ లోపం
- జీవన్ రెడ్డిని ఒప్పించేందుకు రంగంలోకి రాష్ట్ర నాయకత్వం
- కీలక నేత దూరం కావడం పార్టీకి రాజకీయ నష్టం
- గుర్తింపు లేనప్పుడు పార్టీలో ఉండటం వృధా' అని స్పష్టీకరణ.
- రాజీనామా ఉపసంహరించుకుంటారా లేదా అన్నది సస్పెన్స్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీలో అత్యంత సీనియర్ నాయకుడిగా, చట్టసభల్లో తన గంభీరమైన గళంతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసే ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి రాజీనామా నిర్ణయం తీసుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయ యవనికపైనే కాకుండా, రాష్ట్ర స్థాయిలో దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను మోసిన ఒక ధీశాలి పార్టీకి దూరం కావాలని భావించడం వెనుక ఉన్న వేదన సామాన్యమైనది కాదు. జగిత్యాల నియోజకవర్గ కేంద్రంగా సాగుతున్న పరిణామాలు, స్థానిక నాయకత్వ పోకడలు ఆయనను తీవ్రమైన అసంతృప్తికి గురిచేశాయి.

మిగతా 3లో..



## నిద్రలోనే తెల్లారిన బతుకులు

### మార్కాపురం ఘోర ప్రమాదంపై ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- గాయపడిన వారికి రూ. 1 లక్ష చొప్పున ప్రభుత్వం అందజేత
- బాధితులందరికీ ప్రభుత్వ ఖర్చుతోనే మెరుగైన వైద్యం
- కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలంలోనే ఉండి పర్యవేక్షించాలని ఆదేశం
- బస్సు-టిప్పర్ ఢీకొన్న ఘటనలో 13 మంది సజీవ దహనం
- డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతులను గుర్తించే ప్రక్రియ
- అదనంగా పీఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ. 2 లక్షల సాయం
- రవాణా శాఖాధికారుల సమగ్ర నివేదిక కోరిన ప్రభుత్వం
- మృతుల అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచన




03



ఏపీలోని ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం యావత్ రాష్ట్రాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రాయవరం వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి బోల్తా పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బీభత్సం సృష్టించాయి. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే అగ్నికీలలు వాహనాన్ని చుట్టుముట్టాయి. ఈ దుర్ఘటనలో పలువురు సజీవ దహనం కాగా, మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాద తీవ్రతను చూస్తుంటే మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దారుణ ఘటనపై ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు మృతి చెందడం, మరికొందరు గాయపడటంపై ఆయన విచారం వ్యక్తం చేస్తూ బాధితులకు అండగా ఉంటామని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని తక్షణమే ప్రకటించారు.

## ఇరాన్ నావిక దళాధిపతి హతం



- ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ నావికా దళాధిపతి అలీరెజా మృతి
- పోర్ట్ సిటీ బందర్ అబ్బాస్‌పై జరిగిన దాడిలో అలీరెజా మరణం
- శక్తివంతమైన ఐఆర్‌జీసీ నౌకాదళ విభాగానికి ఈయనే బాధ్యుడు
- హర్మ్మజ్ జలసంధిని మూసివేయడంలో అలీరెజా పాత్ర కీలకం
- ఇజ్రాయెల్ మీడియా ప్రకటించగా, ఇరాన్ ఇంకా మౌనంగా ఉంది
- కీలక సమయంలో ఈయన మరణం ఇరాన్‌కు కోలుకోలేని దెబ్బ

02

## మిత్ర దేశాలకు హర్మ్మజ్ ఓపెన్

- భారత నౌకల ప్రయాణానికి ఇరాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది
- భారత్, రష్యా, చైనా, పాక్ నౌకలపై ఆంక్షలు లేవు
- మన నౌకలకు ఇరాన్ సాయుధ దళాలు రక్షణ కల్పిస్తాయి
- జలసంధిని పూర్తిగా మూసివేయలేదని స్పష్టీకరణ
- చమురు రవాణాకు కీలకమైన ఈ మార్గంలో ప్రయాణం సులభం
- ఉద్రిక్తతల వేళ మిత్ర దేశాలకు ఇరాన్ పెద్ద ఊరటనిచ్చింది

02



## సీఎంలతో మోడీ వర్చువల్ మీటింగ్

- సాయంత్రం 6:30కి సీఎంలతో ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్
- ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం వల్ల దేశంలో పరిస్థితులపై చర్చ
- పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై కీలక సూచనలు
- విదేశాల్లోని భారతీయులను రప్పించే ప్రణాళికపై నిర్ణయం
- కోడ్ ఉన్న రాష్ట్రాల్లో సీఎంలకు బదులు సీఎస్‌లతో భేటీ
- ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచన



**విశాలభారతి, జాతీయం:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలక అడుగు వేశారు. అమెరికా అండతో ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య సాగుతున్న భీకర పోరాటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తోంది. ఈ ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పై

మిగతా 2లో..

## విద్య, వైద్యం మా ప్రాధాన్యత

- రాష్ట్రంలో కొత్తగా 10 వేల సూపర్ స్పెషాలిటీ బెడ్స్
- కొత్త ఉస్మానియా హాస్పిటల్ కోసం రూ. 3,000 కోట్లు
- ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ బాధ్యతల నుంచి డాక్టర్లకు విముక్తి
- విదేశీ డాక్టర్ల సేవలకు ప్రత్యేక వెబ్ వేదిక ఏర్పాటు
- రాజీవ్ ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ నిధులపై గణాంకాల వెల్లడి
- నిమ్స్, టిమ్స్ పనులను వేగవంతం చేశామని వెల్లడి
- నర్సరీ నుండి 10వ తరగతి వరకు కొత్త ప్లాన్
- తెలంగాణను దేశానికే రోల్ మాడల్‌గా మారుస్తామన్న సీఎం
- ప్రజల నుండి మంచి సూచనలు స్వీకరిస్తామని స్పష్టీకరణ



విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ రాష్ట్రంలో వైద్య, విద్య రంగాలను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగతా 3లో..




## కోట్లలో జీఎస్టీ దందా

- ఏపీ, తెలంగాణల్లో రూ. 217 కోట్ల జీఎస్టీ మోసం వెలుగులోకి
- పన్ను ఎగ్గొట్టేందుకు ఏకంగా 72 షెల్ కంపెనీల ఏర్పాటు
- తప్పుడు బిల్లులతో కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు
- రెండు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం
- ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులను గుర్తించి అరెస్ట్
- ఈ స్కామ్‌లో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ

05

## ఒకే గొడుగు కిందకు రెవెన్యూ సేవలు

- సర్వే, రిజిస్ట్రేషన్ సేవలు ఇకపై ఒకే విభాగం పరిధిలోకి
- పాత ధరణి పోర్టల్ స్థానంలో కొత్త పారదర్శక వ్యవస్థ
- భూ సమస్యల కోసం వేర్వేరు ఆఫీసులకు వెళ్లాల్సిన పనిలేదు
- ఆధునిక టెక్నాలజీతో భూముల రీ-సర్వే నిర్వహించి రికార్డుల అప్డేట్
- మధ్యవర్తుల ప్రమేయం తగ్గించి సేవలు సులభతరం చేయడమే లక్ష్యం
- భూ రికార్డులన్నీ తప్పుల్లేకుండా డిజిటల్ రూపంలోకి మార్పు



04

## వైద్యం, ఐటీ రంగాలు గాలికి

- ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలి
- పరిమితి పెంచినా, బడ్జెట్ ఖర్చు ఎందుకు తగ్గింది?
- బీఆర్ఎస్ హయాంలో 18 లక్షల మందికి ఉచిత వైద్యం
- ద్వితీయ శ్రేణి నగరాల ఐటీ టవర్లను గాలికొదిలేశారు
- ఐటీ టవర్ నుండి ఇప్పటికే 7 కంపెనీలు వెళ్లిపోయాయి
- ఐటీ సెంటర్లలో ఇంటర్నెట్ బిల్లులు కూడా కట్టడం లేదు



03

# విద్య, వైద్యం మా ప్రాధాన్యత

**మొదటిపేజీ తరువాయి**



అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజంలో వైద్య రంగం నిత్యం కొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రాన్ని దేశానికే ఒక ఆదర్శవంతమైన రోల్ మాడల్‌గా మార్చాలన్న సంకల్పంతో తమ యంత్రాంగం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. గత 27 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీల ద్వారా పేదలకు అందించిన ఆర్థిక సాయంపై గణాంకాలతో కూడిన వివరాలను సభ ముందు ఉంచారు. ప్రజల సంక్షేమం కోసం ప్రతిపక్షాలు ఇచ్చే సానుకూల సూచనలను స్వీకరించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో విద్య, వైద్యం మొదటి స్థానంలో ఉంటాయని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అత్యాధునిక వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. నిమ్స్ ఆసుపత్రి విస్తరణతో పాటు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వరంగల్ పట్టణంలో నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రిని కూడా యుద్ధప్రతిపాదికన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వీటితో పాటు దాదాపు రూ.3 వేల కోట్ల భారీ వ్యయంతో కొత్తగా నిర్మించనున్న ఉస్మానియా ఆసుపత్రి భవనం రాష్ట్ర వైద్య రంగంలో తలమానికంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పదివేల పడకల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి చికిత్సను ఉచితంగా అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ భారీ ఆసుపత్రుల నిర్మాణంతో సామాన్యులకు మెరుగైన వైద్యం చేరువవుతుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేవలం భవనాల నిర్మాణమే కాకుండా, వాటిలో అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన సిబ్బందిని కేటాయించే విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని చెప్పారు. పేద ప్రజలు వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అప్పుల పాలు కాకుండా ప్రభుత్వమే భరోసా ఇస్తుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే తెలంగాణ వైద్య హబ్‌గా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్య సేవల నాణ్యతను పెంచేందుకు ఆసుపత్రుల నిర్వహణ విధానంలో కీలక మార్పులు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం వైద్యులే ఆసుపత్రి పరిపాలన, నిర్వహణ బాధ్యతలను చూస్తుండటం వల్ల వారు రోగుల చికిత్సపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారని ముఖ్యమంత్రి గుర్తించారు. ఈ సమస్యను అధిగమించడానికి వైద్య సేవలను, పరిపాలనా విభాగాలను వేరు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నిర్వహణ బాధ్యతలను ప్రత్యేక విభాగానికి అప్పగించడం ద్వారా వైద్యులు తమ సమయాన్ని పూర్తిగా రోగుల ప్రాణాలు కాపాడటానికే కేటాయించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ మార్పు వల్ల ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరులో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఆయన వివరించారు. విదేశాల్లో స్థిరపడి వైద్య రంగంలో అపారమైన కీర్తిని గడించిన తెలుగు వైద్యులను రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వారు స్వరాష్ట్రానికి వచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పేద రోగులకు తమ సేవలను ఉచితంగా అందించేలా ఒక వేదికను సిద్ధం చేస్తున్నారు. దీనికోసం వైద్య ఆరోగ్య శాఖ వెబ్‌సైట్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి, ఆసక్తి కలిగిన వైద్యులు తమ సమయాన్ని కేటాయించుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. ప్రముఖ నిపుణుల సేవలు సామాన్యులకు అందడం వల్ల వైద్య నాణ్యత పెరుగుతుందని ప్రభుత్వం నమ్ముతోంది. అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాన్ని స్థానిక అవసరాలకు అనుసంధానించడమే ఈ వినూత్న ఆలోచన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. విద్య రంగంలో కూడా నర్సరీ స్థాయి నుండి పదో తరగతి వరకు సమగ్రమైన ప్రణాళికను అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే వైద్య రంగంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వరకు ఒకే గొడుగు కిందకు తెచ్చేలా కార్యాచరణ రూపొందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్యులకు ప్రాథమిక చికిత్స అందడమే కాకుండా, అవసరమైనప్పుడు అత్యున్నత స్థాయి చికిత్సకు వెంటనే రిఫర్ చేసేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. ప్రభుత్వ బడులు, దవాఖానాల రూపురేఖలను మార్చడమే తమ ప్రస్థానంలో ముఖ్యమైన ఘట్టమని పేర్కొన్నారు. ఈ క్రమంలో బడ్జెట్‌లో వీటికి భారీగా నిధులను కేటాయించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు.

గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వైద్య రంగ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వ్యవస్థను గాడిలో పెడుతున్నామని సీఎం చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచడమే కాకుండా, ఆసుపత్రులకు చెల్లింపులు క్రమబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉస్మానియా వంటి చారిత్రక ఆసుపత్రుల అభివృద్ధిపై గతంలో జరిగిన జాప్యాన్ని నివారిస్తూ, స్పష్టమైన కాలపరిమితితో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. వైద్య కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలనే లక్ష్యాన్ని నాణ్యతతో కూడిన విద్యతో అనుసంధానం చేస్తున్నట్లు సభకు వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్యం, భద్రత వంటి అంశాల్లో కూడా కొత్త నిబంధనలను ప్రవేశపెడుతున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. రోగుల సహాయకులకు కనీస సదుపాయాలు కల్పించేలా ఆసుపత్రుల ప్రాంగణాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. వైద్యం కోసం వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే సిబ్బంది ప్రథమ కర్తవ్యం కావాలని ఆదేశించారు. మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు స్టాక్ పర్యవేక్షణకు డిజిటల్ వ్యవస్థను వాడుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ సంస్కరణలు దీర్ఘకాలంలో సత్ఫలితాలను ఇస్తాయని, ప్రజలు ప్రభుత్వ వైద్యంపై పూర్తి నమ్మకాన్ని పెంచుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల విమర్శలకు సమాధానమిస్తూ, వాస్తవాలను గ్రహించి మాట్లాడాలని సూచించారు. తాము చేస్తున్న అభివృద్ధి కళ్లముందే కనిపిస్తోందని, నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తున్నామని చెప్పారు. కేవలం భవనాలకే పరిమితం కాకుండా, సామాన్యుడి ఆరోగ్య భద్రతే తమ నినాదమని ప్రకటించారు. పేదవాడి సొమ్మును ప్రాజెక్టుల పేరుతో వృధా చేయకుండా, నేరుగా వారి ఆరోగ్యానికి ఖర్చు చేస్తున్నామని వివరించారు. వైద్య రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కంకణం కట్టుకున్నామని రేవంత్ రెడ్డి గంభీరంగా ప్రకటించారు. ఈ క్రమంలో అందరి సహకారం అవసరమని కోరారు. చివరిగా, రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే విద్య, ఆరోగ్యం వంటి పునాది రంగాలపై పెడుతున్న పెట్టుబడి రాబోయే తరాలకు వరమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. విద్యార్థులు నాణ్యమైన చదువు చదవాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనేదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని చెప్పారు. ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక ప్రణాళికలు ఇప్పటికే అమలులోకి వచ్చాయని, క్షేత్రస్థాయిలో మార్పులు మొదలయ్యాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సభలో సీఎం చేసిన ఈ ప్రకటనలు రాష్ట్ర వైద్య రంగంలో నూతనోత్తేజాన్ని నింపాయి. నగరంలోని నాలుగు దిక్కులా నిర్మిస్తున్న భారీ ఆసుపత్రులు అందుబాటులోకి వస్తే గాంధీ, నిమ్స్ వంటి ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గుతుందని ముఖ్యమంత్రి విశ్లేషించారు. దీనివల్ల రోగులకు నిరీక్షణ సమయం తగ్గి, తక్షణమే అత్యవసర చికిత్స లభిస్తుందని వివరించారు. ఆధునిక సాంకేతికతను వైద్య రంగంలో జోడించి, టెలీ మెడిసిన్ వంటి సేవలను కూడా విస్తృతం చేస్తామని హామీ ఇచ్చారు. వైద్యులు, రోగుల మధ్య సత్సంబంధాలు నెలకొనేలా కౌన్సిలింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. మొత్తం మీద రాష్ట్రంలో ఆరోగ్య విప్లవానికి తమ ప్రభుత్వం పునాదులు వేసిందని రేవంత్ రెడ్డి సగర్వంగా ప్రకటించారు.

# నిద్రలోనే తెల్లారిన బతుకులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ఏపీలోని ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం యావత్ రాష్ట్రాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రాయవరం వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి బోల్తా పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బీభత్సం సృష్టించాయి. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే అగ్నికీలలు వాహనాన్ని చుట్టుముట్టాయి. ఈ దుర్ఘటనలో పలువురు సజీవ దహనం కాగా, మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాద తీవ్రతను చూస్తుంటే మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దారుణ ఘటనపై ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు మృతి చెందడం, మరికొందరు గాయపడటంపై ఆయన విచారం వ్యక్తం చేస్తూ బాధితులకు అండగా ఉంటామని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని తక్షణమే ప్రకటించారు. హైదరాబాద్ నుంచి కంబం వైపు వెళ్తున్న ఈ ప్రైవేటు బస్సులో సుమారు 40 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. రాయవరం మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం వేగంగా రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. డీజిల్ ట్యాంక్ పగిలిపోవడంతో నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు అంతటా వ్యాపించాయి. లోపల ఉన్న వారు బయటకు వచ్చే మార్గం లేక హాహాకారాలు చేశారు. చీకటి సమయం కావడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి పరిస్థితి విషమంగా మారింది. అగ్నిప్రమాదం ధాటికి బస్సు పూర్తిగా కాలిపోయి ఇనుప అస్థిపంజరంలా తయారైంది. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంటలు గగనతలాన్ని తాకాయి. వేడి ధాటికి బస్సు కిటికీలు పగలగొట్టుకుని కొందరు ప్రయాణికులు బయటకు దూకి ప్రాణాలు రక్షించుకున్నారు. లోపల చిక్కుకుపోయిన వారు ఆర్తనాదాలు చేస్తున్నా భీకరమైన అగ్ని కీలల కారణంగా ఎవరూ దగ్గరకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది తక్షణమే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే జరగకూడని నష్టం జరిగిపోయింది. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో వాటిని గుర్తించడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది. సంఘటనా స్థలంలో దృశ్యాలు అత్యంత హృదయవిదారకంగా ఉన్నాయి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

ప్రమాదం జరిగిన తీరును బట్టి అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు ప్రధాన కారణాలని అధికారులు భావిస్తున్నారు. గాయపడిన వారిని వెంటనే మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. వీరిలో పలువురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొందరిని ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రమాద కారణాలపై సమగ్ర నివేదిక కోరారు. ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను త్వరగా అందేలా చూడాలని అధికారులకు సూచించారు.

రాయవరం సమీపంలోని జాతీయ రహదారిపై రక్తపు మడుగులు, కాలిపోయిన వస్తువుల ఆనవాళ్లు గుండెను తరుక్కుపోతున్నాయి. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న చిన్నారులు, మహిళల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. తమ వారు క్షేమంగా ఉన్నారో లేదో తెలియక బాధితుల కుటుంబ సభ్యులు ఆసుపత్రుల వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు హెల్ప్ లైన్ నంబర్లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని ప్రయాణికుల బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని విమర్శిస్తున్నారు. పరిహారం ప్రకటించినప్పటికీ కోల్పోయిన ప్రాణాలు తిరిగి రావని వారు ఆవేదన చెందుతున్నారు.

ప్రైవేటు బస్సుల అడ్డగోలు ప్రయాణాలు, నిబంధనల ఉల్లంఘనపై రవాణా శాఖ అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిట్ నెస్ లేని వాహనాలు యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. డ్రైవర్ అలసత్వం ఉందా లేక సాంకేతిక లోపం వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. వాహనాల్లో అగ్నిమాపక పరికరాలు లేకపోవడం వల్ల ప్రాణనష్టం పెరిగిందని తెలుస్తోంది. రాత్రి ప్రయాణాల్లో భద్రత గాలికి వదిలేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి ఆదేశాలతో రవాణా శాఖాధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు.

బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు రెవెన్యూ యంత్రాంగం వేగంగా రంగంలోకి దిగింది. మృతుల వివరాలను సేకరించేందుకు బస్సు రిజిస్ట్రేషన్ నంబర్, టికెట్ బుకింగ్ డేటా ఆధారంగా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రమాదంతో రాయవరం పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రయాణం మధ్యలో ఇలాంటి ఘోరం జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. క్షేమంగా ఇళ్లకు చేరుకుంటామనుకున్న వారు విగతజీవులుగా మారడం అందరినీ కలిచివేస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల సహాయం బాధిత కుటుంబాలకు కొంత ఊరటనిస్తుందని భావిస్తున్నారు. సహాయక చర్యలు పూర్తయిన తర్వాత బస్సును రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి ముందడుగు వేయడం గమనార్హం.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి పోలీసులు ప్రాథమిక స్టేట్ మెంట్లను రికార్డు చేస్తున్నారు. ఒక్కసారిగా పెద్ద పేలుడు శబ్దం వినిపించిందని, ఏం జరుగుతుందో తెలిసేలోపే మంటలు చుట్టుముట్టాయని క్షతగాత్రులు భయాందోళనతో వివరిస్తున్నారు. ప్రాణాలతో బయటపడటం తమ అదృష్టమని కొందరు కన్నీటి పర్యంతమవుతున్నారు. కళ్ల ముందే సహ ప్రయాణికులు అగ్నికి ఆహుతి కావడం చూసి వారు తల్లడిల్లిపోతున్నారు. ఈ విషాద ఘటన నుంచి కోలుకోవడానికి బాధితులకు చాలా సమయం పడుతుంది. ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా ఆసుపత్రి వర్గాలతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తోంది. బాధితులకు ఉచిత వైద్యం అందించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

రహదారి భద్రతపై ఎన్ని అవగాహన సదస్సులు నిర్వహించినా ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం ఆందోళన కలిగిస్తోంది. వేగ నియంత్రణ పరికరాలు సరిగ్గా పని చేస్తున్నాయా లేదా అనేది తనిఖీ చేయడంలో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. రాత్రి వేళల్లో సుదీర్ఘ ప్రయాణాలు చేసే డ్రైవర్లకు సరైన విశ్రాంతి లేకపోవడం కూడా ప్రమాదాలకు దారితీస్తోంది. ఈ దుర్ఘటన తర్వాతైనా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు. నిబంధనలు ఉల్లంఘించే ట్రావెల్స్ సంస్థల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్లు పెరిగాయి. రహదారులపై నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యాజమాన్యాల నిర్లక్ష్యంపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

# 'సీనియార్టీకి విలువేది సీఎం'

**మొదటిపేజీ తరువాయి**



దశాబ్దాల కాలం పాటు క్రమశిక్షణ గల కార్యకర్తగా, మేధావిగా పేరున్న నేత నేడు తన సొంత గూటిని వీడాలని నిశ్చయించుకోవడం వెనుక ఉన్న రాజకీయ మర్మంపై లోతైన చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్ఠానానికి సమర్పించిన రాజీనామా లేఖలో జీవన్ రెడ్డి తన మనోగతాన్ని అత్యంత స్పష్టంగా ఆవిష్కరించారు. క్లిష్ట కాలంలో పార్టీని నమ్ముకుని ఉన్న నేతలకు నేడు తగిన గుర్తింపు లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జగిత్యాల ప్రాంతంలో లోకల్ లీడర్‌షిప్ విషయంలో పార్టీ అనుసరిస్తున్న విధానాలు, సీనియర్ల అభిప్రాయాలను బేఖాతరు చేస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు తనను కలచివేసాయన్నారు. ముప్పై ఏళ్లకు పైగా పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన తనకు, తన అనుచర వర్గానికి జరుగుతున్న అవమానాలను భరించలేకనే ఈ కఠిన నిర్ణయానికి వచ్చినట్లు ఆయన మాటలను బట్టి అర్థమవుతోంది. సీనియార్టీకి విలువ లేని చోట కొనసాగడం ఆత్మగౌరవానికి భంగకరమని ఆయన భావిస్తున్నారు.

జగిత్యాల నియోజకవర్గంలో గత కొంత కాలంగా రాజుకుంటున్న అంతర్గత విభేదాలు నేడు ఈ స్థాయికి చేరుకున్నాయి. స్థానిక మున్సిపల్ వ్యవహారాల్లో గానీ, ఇతర ప్రభుత్వ నిర్ణయాల్లో గానీ తన ప్రమేయం లేకుండా పోవడంపై జీవన్ రెడ్డి గతంలోనే అసహనం వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రత్యర్థులకు పార్టీలో పెద్దపీట వేయడం, ముఖ్యమైన నామినేటెడ్ పదవుల భర్తీలో తన వర్గాన్ని విస్మరించడం ఆయనను మరింత కుంగదీశాయి. ఒకప్పుడు తాను వ్యతిరేకించిన శక్తులే నేడు పార్టీలో చక్రం తిప్పుతుండటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలోనే తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి రాజీనామా ఒక్కటే మార్గమని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న తరుణంలో జీవన్ రెడ్డి వంటి అజాతశత్రువు పార్టీకి దూరం కావడం రాజకీయంగా ఇబ్బందికర పరిణామం. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో పట్టున్న నేతగా ఆయనకు ఉన్న ఇమేజ్ పార్టీకి ఎంతో బలాన్ని ఇచ్చేది. అలాంటి వ్యక్తి అసంతృప్తితో వెళ్ళిపోతే అది కేవలం ఒక జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాత కాంగ్రెస్ నేతలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వంపై ఇది ఒక రకమైన నైతిక ఒత్తిడిని పెంచుతోంది. సీనియర్లను గౌరవించుకోవడంలో విఫలమయ్యామన్న విమర్శలు విపక్షాలకు ఆయుధంగా మారుతున్నాయి. ప్రస్తుతం పార్టీలో ఉన్న పాత నేతలు, కొత్తగా చేరిన వారి మధ్య సమన్వయం లోపించడం వల్లే ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అధికారంలోకి వచ్చిన ఉత్సాహంలో ఉన్న కేడర్‌ను, పాత తరం నాయకత్వాన్ని ఒక తాటిపైకి తీసుకురావడంలో రాష్ట్ర స్థాయి నాయకత్వం తడబడుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జీవన్ రెడ్డి లేవనెత్తిన అంశాలు కేవలం ఆయన వ్యక్తిగత సమస్యలు కావు, అవి పార్టీలోని అనేక మంది అంతర్గత వేదనకు ప్రతిరూపాలు. ఈ విషయాన్ని అధిష్ఠానం సకాలంలో గుర్తించకపోతే మరికొందరు నేతలు కూడా ఇదే బాట పట్టే ప్రమాదం ఉందని హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

రాజీనామా వార్త తెలిసిన వెంటనే రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం రంగంలోకి దిగి బుజ్జగింపు చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కూడా ఆయనతో సంప్రదింపులు జరిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే, ఈసారి జీవన్ రెడ్డి వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. గతంలోనూ పలుమార్లు తన అభ్యంతరాలను పార్టీ వేదికలపై విన్నవించినా ఫలితం లేకపోవడంతో, ఇప్పుడు కేవలం మాటలతో ఆయనను శాంతపరచడం సాధ్యం కాకపోవచ్చు. క్షేత్రస్థాయిలో మార్పులు జరిగితే తప్ప ఆయన తన రాజీనామాను వెనక్కి తీసుకునే పరిస్థితి లేదని ఆయన అనుచరులు స్పష్టం చేస్తున్నారు. జీవన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం గమనిస్తే ఆయన ఎప్పుడూ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారు. పదవుల కోసం పాకులాడకుండా ప్రజా సమస్యలపై చట్టసభల్లో గళమెత్తడం ఆయన నైజం. అలాంటి నేత రాజీనామా నిర్ణయం తీసుకున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లోపించిందని, ఏకపక్ష నిర్ణయాలు పెరిగిపోయాయని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ బలహీనపడటానికి దారితీస్తాయని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. రాజకీయ భవిష్యత్తుపై ఆయన తదుపరి అడుగు ఎలా ఉంటుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ రాజీనామా రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. జగిత్యాల జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు రెండు వర్గాలుగా చీలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. జీవన్ రెడ్డి వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్న పెద్ద ఎత్తున కార్యకర్తలు ఆయన నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు. పార్టీలో విధేయతకు పట్టం కట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అధిష్ఠానం తక్షణమే జోక్యం చేసుకోకపోతే జగిత్యాలలో పార్టీ పునాదులు కదిలిపోయే అవకాశం ఉందని గ్రౌండ్ రిపోర్టులు చెబుతున్నాయి. ప్రతిపక్షాలు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కాంగ్రెస్‌పై విమర్శల దాడిని పెంచాయి. రాష్ట్ర రాజకీయాల్లో ఒక సామాజిక వర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న జీవన్ రెడ్డిని కోల్పోవడం కాంగ్రెస్‌కు పూడ్చలేని లోటు. ఆయన కేవలం ఒక ఎమ్మెల్సీ మాత్రమే కాదు, అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న పోరాట యోధుడు. ఆయన లేని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ప్రాంతంలో తన ప్రభావాన్ని కోల్పోయే అవకాశం ఉంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కంటే ఇలాంటి రాజకీయ గొడవలే ప్రజల్లోకి ఎక్కువగా వెళ్తుండటం పార్టీకి మైనస్ పాయింట్‌గా మారింది.

# వైద్యం, ఐటీ రంగాలు గాలికి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ఆరోగ్యశ్రీ పథకం అమలు, పెండింగ్ బిల్లుల అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడి చర్చ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఈ పథకంపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ కీలక ప్రశ్నలు సంధించారు. ఆరోగ్యశ్రీ కింద ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు గుట్టలుగా పేరుకుపోతున్నాయని, వాటిని ఎప్పటిలోగా చెల్లిస్తారో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు అత్యవసర వైద్యం అందించే ఈ పథకం నిధుల కొరతతో కుంటుపడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో వైద్య రంగానికి పెద్దపీట వేశామని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఆరోగ్యశ్రీ పథకం కోసం సుమారు 8 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, తద్వారా 18 లక్షల మంది పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందాయని హరీశ్ రావు గణాంకాలతో వివరించారు. 202324 ఆర్థిక సంవత్సరంలో తమ ప్రభుత్వం ఈ పథకం కోసం 1,067 కోట్ల రూపాయలు వెచ్చించినట్లు సభ దృష్టికి తెచ్చారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 202425 సంవత్సరానికి గానూ కేవలం 971 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు మారడం వల్లే నిధుల కేటాయింపుల్లో కోత పడిందని ఆయన విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలకు పెంచుతూ నిర్ణయం తీసుకుందని హరీశ్ రావు ప్రస్తావించారు. లబ్ధి చేకూర్చే పరిమితి పెరిగినప్పుడు సహజంగానే ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం కూడా పెరగాలని ఆయన తర్కాన్ని లేవనెత్తారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని, ఖర్చు పెరగాల్సింది పోయి తగ్గడం వెనుక ఉన్న మర్మమేంటని ప్రశ్నించారు. ఇది కేవలం కాగితాలకే పరిమితమైన పెంపు తప్ప, పేదలకు అందుతున్న వాస్తవ లబ్ధి కాదని ఆయన ఎద్దేవా చేశారు.

ఆసుపత్రులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన బకాయిలు సకాలంలో అందకపోవడం వల్ల రోగులకు సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. బకాయిలు పేరుకుపోతే ప్రైవేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ రోగులను చేర్చుకోవడానికి వెనుకాడతాయని, ఇది పేదల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని హెచ్చరించారు. బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం కాలయాపన చేయకుండా తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు. వైద్యం అనేది ప్రాథమిక హక్కు అని, దాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదని ఆయన ప్రభుత్వానికి హితవు పలికారు.

వైద్య రంగంతో పాటు రాష్ట్రంలోని ఐటీ రంగం పరిస్థితిపై కూడా హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ పరిశ్రమను విస్తరించాలనే లక్ష్యంతో నిర్మించిన ఐటీ టవర్లను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని ఆరోపించారు. టైర్ 2 నగరాల్లో ఐటీ అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని తాము ఎంతో కృషి చేశామని చెప్పారు. కానీ ఇప్పుడు ఆ టవర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని, కొత్త కంపెనీలను ఆకర్షించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆయన దుయ్యబట్టారు. ఐటీ టవర్లలో కనీస సౌకర్యాల కల్పనలో కూడా ప్రభుత్వం విఫలమైందని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయాల నిర్వహణకు అత్యంత అవసరమైన ఇంటర్నెట్ బిల్లులను కూడా ప్రభుత్వం సకాలంలో చెల్లించడం లేదని సభలో వెల్లడించారు. ఇలాంటి చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస మౌలిక వసతులు కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉంటే కంపెనీలు ఎలా మనుగడ సాగిస్తాయని ఆయన నిలదీశారు. ఐటీ రంగంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నించారు.

సిద్దిపేటలో నిర్మించిన ఐటీ టవర్ పరిస్థితిని ఉదాహరణగా చూపుతూ హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో సిద్దిపేట ఐటీ టవర్‌లో 18 కంపెనీలు తమ కార్యకలాపాలను నిర్వహించేవని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే అక్కడి నుంచి 7 కంపెనీలు వెళ్ళిపోయాయని సంచలన విషయాలు వెల్లడించారు. ఉన్న కంపెనీలు తరలిపోతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం దారుణమని మండిపడ్డారు. ఇది కేవలం సిద్దిపేటకే పరిమితం కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీ టవర్ల పరిస్థితి ఇలాగే ఉందని విమర్శించారు.

కొత్త కంపెనీలు రాకపోగా ఉన్నవి కూడా వెళ్లిపోతుంటే రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, నిర్వహణ లోపాలు కంపెనీల నిష్క్రమణకు ప్రధాన కారణాలని ఆయన విశ్లేషించారు. ఐటీ రంగం అంటే కేవలం హైదరాబాద్ మాత్రమే కాదని, జిల్లాల్లోని యువతకు కూడా ఆ ఫలాలు అందాలని తాము భావించామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల గ్రామీణ ప్రాంత యువత సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు దూరమవుతున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై ఐటీ శాఖ మంత్రి స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు.



ఐటీ రంగంలో తెలంగాణ సాధించిన వృద్ధిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని హరీశ్ రావు అన్నారు. గత పదేళ్లలో ఐటీ ఎగుమతులు ఎలా పెరిగాయో అందరికీ తెలుసని చెప్పారు. కానీ ప్రస్తుత ప్రభుత్వ ధోరణి చూస్తుంటే పరిశ్రమలు వెనక్కి వెళ్లేలా ఉందని వ్యాఖ్యానించారు. మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా కంపెనీలకు భరోసా ఇవ్వాలని సూచించారు. ద్వితీయ శ్రేణి నగరాల్లోని ఐటీ టవర్లకు ప్రత్యేక నిధులు కేటాయించి వాటిని పునరుద్ధరించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు, ఐటీ టవర్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని హరీశ్ రావు కోరారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షం చేస్తున్న పోరాటాన్ని ప్రభుత్వం సానుకూలంగా తీసుకోవాలని హితవు పలికారు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న వైద్యం, యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఐటీ రంగాలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ రెండు రంగాల్లో నెలకొన్న అస్పష్టతను తొలగించడానికి ప్రభుత్వం ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సభలో హరీశ్ రావు లేవనెత్తిన అంశాలపై అధికార పక్షం నుంచి తీవ్ర ప్రతిస్పందన లభించింది. బకాయిల చెల్లింపు ప్రక్రియ కొనసాగుతోందని ప్రభుత్వం తరపున మంత్రులు వివరణ ఇచ్చారు. అయితే హరీశ్ రావు మాత్రం ప్రభుత్వ సమాధానంతో సంతృప్తి చెందలేదు.

# కోట్లల్లో జీఎస్టీ దందా




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఖజానాకు కన్నం వేస్తూ వందల కోట్ల రూపాయల మేర వస్తు సేవల పన్ను ఎగవేతకు పాల్పడిన భారీ కుంభకోణాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు బట్టబయలు చేశారు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కేంద్రంగా సాగిన ఈ దగాలో సుమారు 217 కోట్ల రూపాయల మేర ప్రభుత్వ ఆదాయానికి గండి పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కేవలం కాగితాలకే పరిమితమైన 72 డొల్ల కంపెనీలను సృష్టించి వాటి ద్వారా అక్రమంగా ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ పొందినట్లు అధికారులు గుర్తించారు. ఈ ముఠా సాగించిన పక్కా ప్లాన్ చూసి స్వయంగా అధికారులే విస్తుపోతున్నారు. ఎక్కడా ఎటువంటి వ్యాపార లావాదేవీలు జరగకుండానే కేవలం నకిలీ ఇన్వాయిస్‌లతో కోట్లాది రూపాయలు కొల్లగొట్టినట్లు ఆధారాలు లభించాయి. ఈ భారీ స్కామ్ వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకునేందుకు డీజీజీఐ హైదరాబాద్ యూనిట్ అధికారులు గత కొన్ని రోజులుగా రహస్యంగా ఆపరేషన్ నిర్వహించారు. నిందితులు అత్యంత చాకచక్యంగా అమాయకుల ఆధార్ కార్డులు, పాన్ కార్డులను సేకరించి వారి పేర్లతో ఈ షెల్ కంపెనీలను నమోదు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఎటువంటి భౌతిక ఉనికి లేని ఈ కార్యాలయాల చిరునామాలతో జీఎస్టీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. ఒక్కో కంపెనీ ద్వారా కొన్ని కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు నకిలీ బిల్లులను సృష్టించారు. ఈ బిల్లుల ఆధారంగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను నుంచి మినహాయింపులు పొందుతూ ఖజానాను లూటీ చేశారు.

విచారణాధికారులు సేకరించిన సమాచారం ప్రకారం ఈ 72 కంపెనీలు ఒకదానితో ఒకటి గొలుసుకట్టు తరహాలో అనుసంధానమై ఉన్నాయి. ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి వస్తువుల సరఫరా జరిగినట్లు తప్పుడు రికార్డులు సృష్టించి వాటి ద్వారా ఐటీసీని క్లెయిమ్ చేశారు. వాస్తవానికి ఏ ఒక్క కంపెనీ కూడా ఎటువంటి ఉత్పత్తిని చేయలేదు సరికదా కనీసం గోదాములను కూడా కలిగి లేదు. కేవలం జీఎస్టీ నెట్‌వర్క్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకుని ఈ ముఠా రెచ్చిపోయింది. పక్కా సమాచారంతో అధికారులు ఏకకాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడు ఐటీ నిపుణుల సాయంతో సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి నకిలీ బిల్లులను రూపొందించినట్లు తెలుస్తోంది. పట్టుబడిన పత్రాల ద్వారా 1,200 కోట్ల రూపాయల విలువైన నకిలీ లావాదేవీలు జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి నేరుగా 217 కోట్ల రూపాయల పన్ను నష్టం వాటిల్లింది. నిందితులు ఈ అక్రమ సంపాదనతో పెద్ద ఎత్తున స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు అనుమానిస్తున్నారు. సోదాల సమయంలో లభించిన డిజిటల్ ఆధారాలు, హార్డ్ డిస్క్‌లను విశ్లేషించిన అధికారులు నిందితుల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలను గుర్తించారు.

డొల్ల కంపెనీల ముసుగులో సాగిన ఈ దగా రాష్ట్ర సరిహద్దులు దాటి ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించినట్లు దర్యాప్తులో బయటపడింది. నిందితులు కేవలం బిల్లులు అమ్మడమే కాకుండా కొన్ని చిన్న తరహా పరిశ్రమలకు కూడా ఈ నకిలీ ఇన్వాయిస్‌లను సరఫరా చేసినట్లు సమాచారం. ఆ పరిశ్రమలు తక్కువ ధరకు ఈ బిల్లులను కొనుగోలు చేసి తమ జీఎస్టీ భారాన్ని తగ్గించుకునేవి. ఈ క్రమంలో అసలు వ్యాపారులు ఎవరు, నకిలీ బిల్లుల కోసం ఆశపడిన వారు ఎవరు అనే కోణంలో డీజీజీఐ ఆరా తీస్తోంది. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నిందితులు వాడిన వ్యూహాలు అత్యంత ఆధునికంగా ఉండటం అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. వీరు వాడిన సిమ్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు అన్నీ ఇతరుల పేర్లపై ఉండటంతో అసలు నేరస్థులను గుర్తించడం సవాలుగా మారింది. అయితే టెక్నాలజీ సాయంతో ఐపీ అడ్రస్‌లను ట్రేస్ చేసిన అధికారులు ఈ నెట్‌వర్క్ మూలాలను కనుగొన్నారు. ఈ స్కామ్‌లో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర ఉందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం జరగాల్సిన వెరిఫికేషన్ ప్రక్రియను ఎలా దాటవేశారనే అంశంపై జీఎస్టీ విభాగం అంతర్గత విచారణకు కూడా ఆదేశించింది.

రాష్ట్ర విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు పుంజుకోవడంతో ఇలాంటి నకిలీ బిల్లుల దందాకు అడ్డాగా మారాయని విశ్లేషకులు భావిస్తున్నారు. స్టీల్, సిమెంట్ వంటి ముడి సరుకుల కొనుగోలులో ఇలాంటి షెల్ కంపెనీల నుంచి బిల్లులు సేకరించడం ద్వారా భారీగా పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారు. తాజాగా పట్టుబడిన 217 కోట్ల కుంభకోణం కేవలం మంచుకొండ కొన మాత్రమేనని, లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని వేల కోట్ల అక్రమాలు వెలుగు చూస్తాయని అధికారులు భావిస్తున్నారు. నిందితుల బ్యాంక్ ఖాతాలను ఇప్పటికే స్తంభింపజేసి రికవరీ చర్యలు ప్రారంభించారు. జీఎస్టీ అమలులోకి వచ్చినప్పటి నుంచి వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని భావించినా ఇలాంటి తెలివైన నేరగాళ్లు కొత్త దారులు వెతుకుతూనే ఉన్నారు. ఆధార్ ఆధారిత జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని ఈ ఘటన నిరూపిస్తోంది. నకిలీ ఇన్వాయిస్‌ల బెడదను అరికట్టేందుకు కృత్రిమ మేధ సాంకేతికతను వాడుతున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ గతంలోనే ప్రకటించింది. ఈ టెక్నాలజీ సాయంతోనే అనుమానాస్పద లావాదేవీలను డీజీజీఐ అధికారులు గుర్తించగలిగారు. పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం గట్టి సంకల్పాన్ని ప్రదర్శిస్తోంది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో కార్యాలయాలు ఉన్నట్లు చూపించి మోసాలకు పాల్పడటం గమనార్హం. అధికారులు ఆయా చిరునామాలకు వెళ్లి చూడగా అక్కడ చిన్న గదులు లేదా అసలు అడ్రస్ లేని ఖాళీ స్థలాలు కనిపించాయి. పేద ప్రజలకు కొంత నగదు ఆశ చూపి వారి వివరాలతో కంపెనీలు పెట్టిన నేరగాళ్లు ఆ తర్వాత పరారయ్యారు. బ్యాంకుల్లో జరిగిన భారీ నగదు ఉపసంహరణల ఆధారంగా అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ స్కామ్ వల్ల నిజాయితీగా పన్ను చెల్లించే వ్యాపారులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం పన్ను ఎగవేతను తీవ్రమైన ఆర్థిక నేరంగా పరిగణిస్తోంది. పట్టుబడిన నిందితులపై ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. ఐటీసీ అక్రమ వినియోగం అనేది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వినియోగదారుల నుంచి పన్ను వసూలు చేసి ప్రభుత్వానికి కట్టకుండా తమ జేబుల్లో నింపుకునే ఇలాంటి వారిని ఉపేక్షించకూడదని పౌర సమాజం కోరుతోంది. ఈ భారీ కుంభకోణం వెలుగులోకి రావడంతో జీఎస్టీ శాఖ అధికారులు ఇతర అనుమానాస్పద కంపెనీలపై కూడా నిఘా పెంచారు.

## శ్రీ తుల్జాభవాని దేవాలయ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**శేరిలింగంపల్లి, విశాలభారతి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం తారానగర్లోని శ్రీ తుల్జాభవాని దేవాలయానికి సంభందించిన 2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురువారం పంచాంగ కర్త బ్రహ్మశ్రీ గౌరిబట్ల రామకృష్ణ శర్మ విచ్చేసి దేవాలయ ఈఓ.ఎం.సత్యచంద్రరెడ్డి, చైర్మన్ బీకేవి రాజశేఖర్ రెడ్డి, ఆలయ పూజారి ప్రణీత్ శర్మ, ధర్మకర్తలు మారం శిరీషలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు రేణుక, పవన్ కుమార్, సత్యంలతో పాటు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

- **జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్.. డ్రోన్ కెమెరాలు,సీసీటీవీల పర్యవేక్షణలో భద్రాచలం పట్టణం**
- **2000 మంది పోలీసులతో ప్రత్యేక నిఘా**



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి :**నేడు జరగనున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం,శనివారం నాడు జరగనున్న పట్టాభిషేకం మహోత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పేర్కొన్నారు.ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్రత్యేక బృందాలతో పటిష్టమైన నిఘా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. సుమారుగా రెండు వేల మంది పోలీసులతో ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భక్తుల కొరకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ మరియు ఆన్లైన్ లింకును రూపొందించడం జరిగిందని తెలిపారు. భద్రాచలం పట్టణం మొత్తం డ్రోన్ కెమెరాలు,సీసీటీవీ లతో నిరంతర పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు.భద్రాచల పట్టణ,పరిసర ప్రాంత ప్రజలు ఈ రెండు రోజులపాటు పోలీసు వారు విధించే ట్రాఫిక్ ఆంక్షలను పాటిస్తూ పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు.

## స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహణ



**మోటకొండూర్ , విశాలాభారతి :**మోటకొండర్ మండలంలోని చందపలి ప్రాథమిక పాఠశాలలో గురువారం "స్వయం పరిపాలన దినోత్సవం"కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో పరిపాలన పట్ల అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.పాఠశాల సిబ్బంది మార్గదర్శకత్వంలో విద్యార్థులు జిల్లా కలెక్టర్, డిఇఓ, ప్రధానోపాధ్యాయుడు, ఎంఇఓ, తహసీల్దార్, ఎంపిడిఓ మరియు సర్పంచ్ వంటి స్థానిక పరిపాలనా అధికారుల పాత్రలను పోషించారు. ప్రభుత్వ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో, అధికారుల బాధ్యతలు ఏమిటో తెలుసుకునే ఉద్దేశంతో విద్యార్థులు అధికారులుగా నటించి తమ ప్రతిభను చాటుచేసుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులకు చిన్న వయసులోనే పరిపాలనా వ్యవస్థపై అవగాహన కల్పించడం వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థుల ఉత్సాహం, చురుకుదనం అందరినీ ఆకట్టుకుంది.విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమానికి పాఠశాల సిబ్బంది పూర్తి మద్దతు అందించారు ముగిసింది.జిల్లా కలెక్టర్ ఏనుగుటాల శ్రీనిధి, డీఈవో బొట్ల తానీషా, ప్రధానోపాధ్యాయుడు గడ్డం సాహితీ, ఎంఈవో కల్లెం బహుషా, తహశీల్దార్ బట్ల అక్షయ్, ఎంపీడీఓ పానుగంటి ఉదయతేజ్, సర్పంచ్ పానుగంటి చందు విద్యార్థులు పాత్రలు పోషించి అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీపతి నరేందర్, ఉపాధ్యాయురాలు మదూరి విజయ పాల్గొన్నారు.

## బిక్కేరు వాగులోకి సాగునీరు విడుదల

**గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు**



**ఆలేరు, విశాలభారతి :** గంధమల్ల రిజర్వాయర్ నుంచి బిక్కేరు వాగులోకి విడుదల చేసిన సాగునీరు మందనపల్లి శివారు నల్లపోచమ్మ ఆలయం వద్దకు చేరడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో వాగులో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చిరుమర్తి రేణుక నరసయ్య హాజరై మాట్లాడుతూ ఆలేరు అభివృద్ధి అన్ని రంగాల్లో కొనసాగుతోందని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాలను సాగునీటితో శ్యామలంగా మార్చి రైతుల కళ్లల్లో ఆనందం చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.రైతుల సమస్యలు అర్థం చేసుకునే నాయకత్వం వల్లే ప్రతి ఏటా బిక్కేరు వాగు, అశ్వరావుపల్లి రిజర్వాయర్, దేవాదుల ప్రాజెక్టు తపాస్‌పల్లి కాలువల ద్వారా ఆలేరు నియోజకవర్గానికి సాగునీరు అందుతోందని తెలిపారు.మాటలు చెప్పే నాయకులకంటే పనులు చేసే నాయకులను ప్రజలు కోరుకున్నారని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.ప్రభుత్వ విప్ ఐలయ్యకు గ్రామస్తుల తరపున శతకోటి వందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటేష్, యువజన విభాగం మండల అధ్యక్షుడు ఉట్కూరి సురేష్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహా గిరి ప్రదక్షిణలో బీజేపీ నాయకుడు




**ఆలేరు, విశాల భారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గానికి చెందిన బీజేపీ జిల్లా నాయకుడు పెండెం నాగేష్‌గురువారం సిద్ధేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన మహా గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరుద్ర నక్షత్రం రోజు గిరి ప్రదక్షిణ చేయడం శ్రేయస్కరమని తెలిపారు.భక్తి, ఆధ్యాత్మికత మనసుకు ప్రశాంతతనిచ్చి సమాజానికి మేలు చేస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, స్వామి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ డ్రైనేజ్, నీటి పైప్‌లైన్ పనులపై సమీక్ష

**త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు కళ్లెం నవజీవన్ రెడ్డి సూచనలు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్ నగర్ ఉమ్మడి డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజ్ మరియు మంచినీటి పైప్‌లైన్ పనుల పురోగతిని హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సమీక్షించారు. ఈ మేరకు హయత్ నగర్ జలమండలి కార్యాలయంలో సంబంధిత అధికారులను కలిసి ప్రగతి వివరాలు తెలుసుకున్నారు. లక్ష్మి ప్రియా కాలనీ, దుర్గా నగర్, పి, టి కాలనీ, గాయత్రీ నగర్, సామనగర్ నుంచి ఓల్డ్ నేషనల్ హైవే వరకు కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజ్ ట్రంక్ లైన్ పనులతో పాటు డివిజన్‌లో ఇంకా పూర్తికాని మంచినీటి పైప్‌లైన్ పనులపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా జలమండలి డీజీఎం నాగరాజ్, మేనేజర్ ప్రియాంకలను కలిసి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తాను పదవిలో ఉన్నా లేకపోయినా హయత్ నగర్ డివిజన్ అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు తన వంతు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.



## కదిరి జైహింద్ మరణం పట్ల నివాళులు

**అంతిమయాత్రలో పాల్గొన్న క్యామా మల్లేష్**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇబ్రహీంపట్నం పట్టణానికి చెందిన కదిరి జైహింద్ మరణించిన విషయం తెలిసి స్థానికంగా విషాదం నెలకొంది. ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామా మల్లేష్ నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కదిరి జైహింద్ సమాజంలో మంచి వ్యక్తిగా గుర్తింపు పొందారని, వారి మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానికులు, కుటుంబ సభ్యులు పాల్గొని ఆయనకు చివరి వీడ్కోలు పలికారు.

## జీహెచ్ఎంసీ పునర్విభజనలో రాజేంద్రనగర్‌కు అన్యాయం

**ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని సైబరాబాద్, హైదరాబాద్, ఫ్యూచర్ సిటీగా మూడు వేర్వేరు కమిషనరేట్ల పరిధిలో విభజించడంపై ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విభజన కారణంగా ప్రజలు పాలనాపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. ఒకే నియోజకవర్గం వేర్వేరు పరిధుల్లో ఉండటం వల్ల అభివృద్ధి పనులు, పోలీసు వ్యవస్థ మధ్య సమన్వయం లోపిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు చిన్నచిన్న సమస్యలకే వివిధ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు తిరగాల్సి వస్తోందని, దీనివల్ల సమయం, శ్రమ వృథా అవుతోందని తెలిపారు. పాలన సౌలభ్యం కోసం నియోజకవర్గాన్ని ఒకే కమిషనరేట్ పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని పూర్తిగా సైబరాబాద్ లేదా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోకి చేర్చి, ఒకే కమిషనరేట్ కింద ఉంచాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ విభజనను సరిదిద్ది పరిపాలనను క్రమబద్ధీకరిస్తే నియోజకవర్గ అభివృద్ధికి దోహదం అవుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## భద్రాచలం చేరుకున్న డీజీపీ శివధర్ రెడ్డి

**కళ్యాణ మహోత్సవానికి కట్టుదిట్టమైన భద్రత**



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:** నేడు జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి భద్రాచలం చేరుకున్నారు. ఆయనకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం రిజర్వ్ పోలీసుల నుంచి డీజీపీ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో డీజీపీ సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అపరిచిత ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ఏడాది కళ్యాణ మహోత్సవం దృష్ట్యా సుమారు 2000 మంది పోలీసులతో భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రద్దీ నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.భక్తులు ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

## మెప్మా ఆధ్వర్యములో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి

**వర్ధన్నపేట , విశాలభారతి:** వర్ధన్నపేట పురపాలక సంఘం నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘం సభ్యులకు, శానిటేషన్ సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అధ్యక్షతన వైద్య శిబిరం ఏర్పాటు నిర్వహించడం జరిగింది. అనంతరం పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజా పాలన ధ్యేయంగా, ప్రజల సమస్యల కోసం ఎనలేని కృషి చేస్తూ, మహిళా సంఘాల సభ్యులకు సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ మహిళలను అభివృద్ధి పథంలో నడిపిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయి. సీఎం రేవంత్ రెడ్డి నిత్యం ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ స్వచ్ఛమైన పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు.

## క్రీడా స్ఫూర్తి చాటి చెప్పడానికే శాసనసభ్యుల క్రీడా పోటీలు

**విశాలభారతి, రామగుండం:**




రాష్ట్రంలో విద్యార్థులు యువకులు అన్ని వర్గాలకు క్రీడల ప్రాముఖ్యత తెలియజేసే విధంగా శాసన సభ్యుల క్రీడోత్సవాలు నిర్వహించబోతున్నామని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు వాకిటి శ్రీహరిలు తెలిపారు. ఈ సమావేశంలో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు క్రీడలు పాటలు మరియు సంస్కృతిక ఉత్సాహాల నిర్వాహణ కమిటీ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ ఎం ఎస్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు.ఈనెల 28 29 తేదీల్లో జరగబోయే శాసనసభ్యులు శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026. నిర్వహణ సన్నాహక సమావేశం గురువారం అసెంబ్లీలోని కమిటీ హాల్లో జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనునిత్యం రాజకీయాల్లో బిజీ ఉండే శాసన సభ్యులు శాసనమండలి సభ్యులకు ఈ క్రీడా పోటీలు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని క్రీడల పట్ల అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పోటీలు మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్నామని, పార్టీలబేధ భావాలు పక్కనపెట్టి శాసనసభ్యులు అందరూ ఈ క్రీడల్లో పాల్గొన్న పోతున్నారని వారు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి వయసుల వారికి క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.ఇందుకోసం శాసనసభ సచివాలయము తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మరియు రాష్ట్ర సాంస్కృతిక శాఖ తోపాటు వివిధ శాఖల సమన్వయంతో శాసనసభ్యులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలిపారు.మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 ప్రారంభ వేడుకలు ఎల్బీ స్టేడియంలో 28వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమవుతాయని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తోపాటు ఉభయ సభల వివిధ పక్ష నేతలు విప్‌లు అన్ని పార్టీల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్ శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ యశస్విని రెడ్డి శాసనమండలి సభ్యులు తాత మధుసూదన్ రావు భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు శాసనసభ కార్యదర్శి ఆర్ తిరుపతి వివిధ క్రీడా వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ ధర్మ భిక్షం 15వ వర్ధంతి

- **సిపిఐ ఆధ్వర్యంలో నివాళులు**
- **ప్రజా పోరాటాలకు ఆయన సేవలు చిరస్మరణీయం**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, గీతా కార్మికుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మ భిక్షం 15వ వర్ధంతినిఅబ్దుల్లాపూర్ మెట్ మండలం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అబ్దుల్లాపూర్‌మెట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ధర్మ భిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. ధర్మ భిక్షం నిరుపేదల పక్షాన నిలబడి జీవితాంతం ప్రజా పోరాటాలు నిర్వహించిన గొప్ప నాయకుడని కొనియాడారు. అనేక భూ పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు పంపిణీ చేయించారని, ఫ్లోరిన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారానికి పార్లమెంటులో పోరాడారని తెలిపారు. గీతా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి అమోఘమని పేర్కొన్నారు. ధర్మ భిక్షం విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని, సూర్యాపేట జిల్లాకు ఆయన పేరు నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి అజ్మీర్ హరి సింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరాచారి, మాజీ ఎంపీపీ బబ్బురి మంజుల దేవేందర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ బిగి దాసు గౌడ్, బాటసింగారం రైతు సేవ సహకార సంఘం మాజీ చైర్మన్ పురం యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ తోర్పునూరి ప్రవీణ్ కుమార్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బాత్ లక్ష్మణ్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు మంజుల నరసింహ, సిపిఐ నాయకులు మధు, రమేష్ నాయక్, రవి, సైదులు ముదిరాజ్, అన్నపూర్ణ, రాములు, లక్ష్మి, యాదగిరి, పుల్లయ్య, సాయిలు, బిక్షపతి, లక్ష్మి, నిరంజన్, బిచ్చి నాయక్, పాండు, సైదులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# గడువు తీరిన పానీయాలతో చిన్నారుల అనారోగ్యం

- కూల్‌డ్రింక్స్ పేరుతో కిల్లర్ డ్రింక్స్ విక్రయం?
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- గడువు తీరిన శీతల పానీయాలు తాగి చిన్నారులు అస్వస్థత
- గిరిజన, గ్రామీణ ప్రాంతాలనే లక్ష్యంగా అక్రమ విక్రయాలు
- ఫుడ్ సేఫ్టీ తనిఖీలు, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్






**అశ్వారావుపేట, విశాలభారతి :**

అశ్వారావుపేట మండలంలో గడువు తీరిన కూల్‌డ్రింక్స్ మరియు ఆహార పదార్థాల విక్రయం కలకలం రేపుతోంది. వేసవి కాలాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యాపారులు గడువు తీరిన పానీయాలు, తినుబండారాలు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుతున్నారనే ఆరోపణలు విని పిస్తున్నాయి. ముఖ్యంగా ఉట్లపల్లి గ్రామంలో గడువు తీరిన శీతల పానీయాలు సేవించిన కారణంగా కొంతమంది చిన్నారులు అనారోగ్యానికి గురైన ఘటన ఆందోళనకు దారి తీసింది. బాధితులను ఆసుపత్రికి తరలించగా, గడువు తీరిన పానీయాల వల్లే సమస్య తలెత్తినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

మండల వ్యాప్తంగా ఉన్న చిన్న దుకాణాలు, కూల్‌డ్రింక్ షాపుల్లో గడువు తీరిన వాటర్ బాటిల్స్, బిస్కెట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ నిల్వ ఉంచి విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గిరిజన ప్రాంతాలు, నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్న గ్రామాలను లక్ష్యంగా చేసుకుని ఈ అక్రమ వ్యాపారం కొనసాగుతున్నట్టు సమాచారం. ఇదే సమయంలో కారం, పసుపు, టీ పొడి, వంట నూనెల వంటి నిత్యావసర వస్తువుల్లో కూడా కల్తీ జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "లాభాల కోసం ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడుతున్నారు" అంటూ ప్రజలు మండిపడుతున్నారు. ఈ ఘటనపై ఆహార భద్రత శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, గడువు తీరిన మరియు కల్తీ వస్తువులు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం, 2006 ప్రకారం గడువు తీరిన ఆహార పదార్థాల విక్రయం నేరమని గుర్తు చేస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వినియోగదారులు ఏ వస్తువు కొనుగోలు చేసినా తయారీ తేదీ, గడువు తేదీ తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు గమనిస్తే ఫుడ్ సేఫ్టీ అధికారులకు, స్థానిక సంస్థలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మొత్తానికి అప్రమత్తతే రక్షణ. ప్రజలు జాగ్రత్తగా ఉంటేనే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## కొలనుపాకలో నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలి



**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు వెంటనే ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం కొలనుపాక గ్రామంలోని సర్వే నంబర్ 8లో సుమారు 70 మంది నిరుపేదలు వేసుకున్న గుడిసెలను ఆయన సీపీఐ జిల్లా నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను గమనించిన ఆయన, సొంత నివాస స్థలం లేక పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే స్పందించి నిరుపేదలకు నివేశ స్థలాలు కేటాయించడంతో పాటు తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పేదల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.సీపీఐ జిల్లా కార్యదర్శి యానాలా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, నిరుపేదలకు నివేశణలు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోలకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, ఎండి ఇమ్రాన్, చిగుర్ల లింగం, మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి రవి తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు పోతు ప్రవీణ్ యాదవ్ పోతే భవాని సంపతి పార్వతి శంకర్ హేమలత శ్రీనివాస్ పోచయ్య మాణిక్యం పుట్ట రమేష్కందుల మధు సుశీల నర్ర సరిత యాదమ్మ రమేష్ క్రాంతి చందు తదితరులు పాల్గొన్నారు.

## కొబ్బరి రైతులకు నూతన దిశ

- అవగాహన కార్యక్రమం, సబ్సిడీ ఎరువుల పంపిణీతో ఉత్సాహం
- కొబ్బరి సాగులో ఆధునిక పద్ధతులపై సమగ్ర అవగాహన
- సబ్సిడీ ఎరువుల పంపిణీ, భీమా పథకాల వివరాలు
- రైతుల ఆదాయ వృద్ధికి ప్రభుత్వ పథకాలపై చర్చ

**అశ్వారావుపేట, విశాలభారతి:** కొబ్బరి రైతుల అభివృద్ధి లక్ష్యంగా కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను అశ్వారావుపేటలో బ్లాక్ స్థాయి అవగాహన కార్యక్రమం మరియు ఎరువుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా నిపుణులు కొబ్బరి సాగులో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులపై సమగ్రంగా అవగాహన కల్పించారు. అధిక దిగుబడిని సాధించడానికి శాస్త్రీయ సాగు విధానాలు, ఎరువుల సమతుల్య వినియోగం, పురుగులు మరియు వ్యాధుల నివారణ చర్యలు, తోటల నిర్వహణలో తాజా సాంకేతికతలపై వివరంగా చర్చించారు. రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇస్తూ, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాగు మార్గాలను సూచించారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు సబ్సిడీపై ఎరువులు పంపిణీ చేశారు. అదేవిధంగా కొబ్బరి తోటల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కొబ్బరి చెట్లు ఎక్కే కార్మికులకు భీమా సదుపాయం, పరిశ్రమలో పనిచేసే వారికి భీమా రక్షణ, శిక్షణ తరగతుల ద్వారా నైపుణ్యాభివృద్ధి అవకాశాల గురించి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ జూపల్లి శశికళ రమేష్, మాజీ అధ్యక్షుడు చిమకుర్తి వెంకటేశ్వరరావు, యువజన నాయకులు జూపల్లి ప్రమోద్ బాబు, కొక్కెరపాటి పుల్లయ్య, ఫణి, బాబీ, కంచర్ల రామారావు, అల్లాడి రామారావు తదితరులు పాల్గొన్నారు. కొబ్బరి బోర్డు సిబ్బంది, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు అశ్వారావుపేట మండలంలోని వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ రమేష్‌ను మహిళా అధికారులు శాలువాతో సత్కరించారు. రైతుల అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆమె సూచించగా, భవిష్యత్తులో కూడా రైతులకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని అధికారులు తెలిపారు.

## దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణ పురోగతిపై సమీక్ష



**వరంగల్ టౌన్, విశాలభారతి:** దేవాదుల జె. చొక్కారావు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించబడింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా లోని నర్సంపేట, దుగ్గొండి, రాయపర్తి, వర్ధన్నపేట, నల్లబెల్లి మండలాల్లో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, ముందస్తు నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రాజెక్ట్ అమలు సజావుగా కొనసాగేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.

## ప్రతి బాధితుడికి న్యాయం జరుగుతుందని నమ్మకం కలిగేలా పనిచేయాలి

### సంగెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ



**వరంగల్ , విశాలభారతి:** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగేలా పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ జిల్లా సంగెం పోలీస్ స్టేషన్‌ను గురువారం సీపీ సందర్శించారు. ఆయనకు సంగెం పోలీసు అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను సీపీ పరిశీలించి, స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ప్రజల జీవన విధానం, స్థానికంగా జరుగుతున్న నేరాలు, రౌడీ షీటర్లు, అనుమానితుల వివరాలను ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది పనితీరు, బీట్ వ్యవస్థ, పెట్రోలింగ్, రికార్డుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. స్టేషన్‌లో నమోదు అయిన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టుకు సంబంధించిన అంశాలపై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, విధి నిర్వహణలో అలసత్వం లేకుండా, పారదర్శకంగా సేవలు అందించాలని తెలిపారు. ప్రజల విశ్వాసం పొందే విధంగా పోలీసులు తమ విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామూనూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సిఐ రాజగోపాల్, సంగెం ఎస్. ఎస్. ఐ వంశీ కృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాదుల భూసేకరణకు వేగం... పెండింగ్ పనులకు కలెక్టర్ కఠిన గడువులు

**నల్లబెల్లి, విశాలభారతి:** దేవాదుల జె. చొక్కారావు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష సమావేశం నిర్వహించారు. నర్సంపేట, దుగ్గొండి, రాయపర్తి, వర్ధన్నపేట, నల్లబెల్లి మండలాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు, ప్రజలకు అసౌకర్యం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలంటూ దిశానిర్దేశం చేశారు.

## దివ్యాంగురాలి పండ్ల దుకాణం తొలగింపుపై వివాదం



- దౌర్జన్యంగా ఖాళీ చేయించాలన్న యజమాని చర్యలపై ఆగ్రహం
- బాధిత కుటుంబానికి న్యాయం కోరిన ఆధార్ పార్టీ
- జీవనాధారంగా ఉన్న పండ్ల దుకాణం తొలగింపుపై ఉద్రిక్తత
- దివ్యాంగురాలి కుటుంబానికి అండగా నిలిచిన ఆధార్ పార్టీ నాయకులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి

**వేంసూరు, విశాలభారతి:**

వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలో దివ్యాంగురాలు నిర్వహిస్తున్న పండ్ల దుకాణాన్ని ఖాళీ చేయించాలన్న యజమాని చర్యలు వివాదానికి దారి తీసాయి. ఈ ఘటనపై ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్ స్పందిస్తూ, నిరుపేద కుటుంబ జీవనాధారాన్ని దెబ్బతీసే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. తుంగ లక్ష్మయ్య, విజయలక్ష్మి దంపతులు గత ఏడు సంవత్సరాలుగా ప్రభుత్వ రహదారి పక్కన పండ్ల దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. దివ్యాంగురాలైన విజయలక్ష్మి కుటుంబ పోషణ కోసం ఈ దుకాణమే ఆధారమై ఉండగా, పక్కనున్న ఇంటి యజమాని దుకాణాన్ని తొలగించాలని ఒత్తిడి చేయడం, దౌర్జన్యానికి పాల్పడటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా కంటే కేశవ గౌడ్ మాట్లాడుతూ, "బ్రతుకుదెరువు కోసం కష్టపడుతున్న పేద కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేయడం అన్యాయం. ఇలాంటి సమయంలో వారికి అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంపై ఉంది" అని పేర్కొన్నారు. ఇప్పటికే బాధితులు అధికారులకు వినతిపత్రం అందజేసినా స్పందన లేకపోవడం విచారకరమని ఆయన అన్నారు. దివ్యాంగురాలి కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని, యజమాని దౌర్జన్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇకపోతే సమస్య పరిష్కారం కాకపోతే ఆధార్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నాయకులు కొమ్ము విజయకుమార్, బాధితులు తుంగ లక్ష్మయ్య, తుంగ విజయలక్ష్మి, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చీమలపాడు ఇసుక ర్యాంపు సమస్య ఎప్పుడు



- టి.జి.ఎం.డి.సి అధికారులు పాత కమిటీపై ఎందుకంత ప్రేమ
- అధికారులు ఒక వర్గానికి ఎందుకు సపోర్ట్ చేస్తున్నారు
- సిపిఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు
- కల్పన, డివిజన్ నాయకులు మునిగేలా శివ ప్రశాంత్

**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:**

గురువారం భద్రాచలంలో ఐటిడిఏ అధికారులకు వినతి పత్రం అందించిన అనంతరం.సిపిఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ కల్పన,శివ ప్రశాంత్ మాట్లాడుతూ. చర్ల మండలం లోని చీమలపాడు ఇసుకరాంపు సొసైటీ గత రెండు సంవత్సరాల నుండి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుందని వారు అన్నారు. బైలాకు విరుద్ధంగా ఉన్న కొయ్యూరు గ్రామస్తుల్ని తొలగించినప్పటికీ ఉన్నత అధికారులు ఆ గ్రామ సభ్యులకు ఎందుకు సపోర్ట్ చేస్తున్నారని వారి అధికారులను ప్రశ్నించారు. మహాజన సభ ఏర్పాటు చేసుకొని నూతన కమిటీని బ్యాంక్ అకౌంట్ వచ్చిన తర్వాత కూడా కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. అధికార పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు మండల స్థాయి డివిజన్ స్థాయి నాయకులు మహిళా సొసైటీలకు అన్యాయం చేసే పద్ధతిని మానుకోవాలని వారు హెచ్చరించారు. భద్రాచలం పినపాక నియోజకవర్గం ఇసుక మాఫియా రోజురోజుకీ పెరిగిపోతుందని కావాలనే కొంతమంది వ్యక్తులు కొంతమంది అధికారులు గొడవలు సృష్టించి ఆర్థిక సంబంధాలు ఏర్పాటు చేసుకొని ప్రజల్ని సొసైటీ సభ్యుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. టి.జి.ఎం.డి.సి అధికారులు పాత కమిటీపై ఎక్కువ ప్రేమతో ఉన్నారని కాలపరిమితి అయిపోయిన వారితోనే ప్రయాణం చేసే ఆలోచనలో ఎందుకు ఉన్నారో అర్థం కావడం లేదని,జెసిబిలు టిప్పర్లు పాత కమిటీ వారికి అద్దెలు ఎక్కువవుతున్నాయని వారి కంటే అధికారులే ఎక్కువగా బాధపడుతున్నారని ఇది చాలా విడ్డూరంగా ఉందని వారన్నారు.టి.జి. ఎం.డి.సి అధికారులు ఈ పద్ధతి మానుకోకుంటే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని వారిని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు చట్టాలు ఉన్నప్పటికీ ఆ చట్టాన్ని కనీసం పట్టించుకోలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గారికి పీసా చట్టంపై పూర్తి అవగాహన ఉన్నప్పటికీ వీటిపై దృష్టి పెట్టకపోవడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చీమలపాడు సొసైటీ ప్రజలకి న్యాయం చేయాలని వారు కోరారు. లేనియెడల రానున్న రోజుల్లో ప్రత్యక్ష ఉద్యమాలకు దిగుతామని ప్రభుత్వ అధికారుల్ని హెచ్చరించారు.

## భౌతిక దేహానికి నివాళులు అర్పించిన రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**శాయంపేట, విశాలభారతి:** శాయంపేట మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్, అడ్వకేట్ గట్ల విజయపాల్ రెడ్డి, గట్ల మహిపాల్ రెడ్డి, గట్ల జైపాల్ రెడ్డి తల్లి గట్ల అహల్యమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మృతురాలి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే ఆమె అంతిమయాత్రలో కూడా పాల్గొన్నారు. అహల్యమ్మ మరణం వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీరని లోటని పేర్కొన్న మంత్రి, భగవంతుడు వారికి మనోధైర్యం, ఆత్మస్థైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.

## ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

- రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన సర్పంచ్ పోలేబోయిన సుజాత
- ఉప సర్పంచ్ బుడగం రాము, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్



**విశాలభారతి, కరకగూడెం:** కరకగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని మెయిన్ సెంటర్‌లో వేసవికాలం ప్రారంభమవడంతో ప్రజలు, ప్రయాణికులు దాహంతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన సర్పంచ్ పోలేబోయిన సుజాత , ఉప సర్పంచ్ బుడగం రాము మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు, ముఖ్యంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా త్రాగునీరు అందుబాటులో ఉండేలా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని,ప్రజల అవసరాలను గుర్తించి ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించడం మా బాధ్యతగా భావిస్తున్నాము.. ఈ సౌకర్యాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరుకుంటున్నాము" అని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు జలగం కృష్ణ , స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు , గ్రామస్తులు మహిళలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి డిపో ఎదుట సీఐటీయూ ధర్నా

- ఆర్టీసీ సంస్థ బలోపేతం, కార్మికుల ఉద్యోగ భద్రతపై డిమాండ్
- వేతన సవరణలు, పెండింగ్ బకాయిల చెల్లింపుపై ఆందోళన




**విశాలభారతి, సత్తుపల్లి:** సత్తుపల్లి ఆర్టీసీ బస్ డిపో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ బస్సుల విధానం వల్ల తెలంగాణ ఆర్టీసీ సంస్థ భవిష్యత్తు, కార్మికుల ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డి.ఎం. గురజాల లక్ష్మీనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరావు మాట్లాడుతూ విద్యుత్ బస్సుల నిర్వహణను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం సరైన విధానం కాదని, వెంటనే ఆర్టీసీకే అప్పగించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం-2019 మరియు విద్యుత్ బస్సుల విధానం వల్ల ఆర్టీసీ రక్షణకు ముప్పు వాటిల్లిందన్నారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకం ద్వారా బస్సుల సంఖ్య పెరిగి ఉద్యోగావకాశాలు వస్తాయని ఆశించినప్పటికీ, ఆ లక్ష్యానికి విరుద్ధంగా ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు. విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణ, ఆపరేషన్ మొత్తం ఆర్టీసీ ఆధ్వర్యంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్వహణ ఖర్చు, ఆదాయం మధ్య వ్యత్యాసాన్ని పూరించేందుకు వయబిలిటీ గ్యాప్ ఫండ్ అందించాలని కోరారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 2021, 2025 వేతన సవరణలను వెంటనే అమలు చేయాలని, 2017 వేతన బకాయిలను చెల్లించాలని, యూనియన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం, యాజమాన్యం సరైన నిర్ణయాలు తీసుకోకపోతే ప్రజలను సమీకరించి మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సభ్యులు చప్పిడి భాస్కర్, దాసు, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు శీలం కరుణ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లు సమాజానికి పునాది వేస్తున్నారు



**ఆలేరు, విశాల భారతి:** అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు సమాజానికి బలమైన పునాది వేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. గురువారం అంగన్వాడీ సిబ్బంది సమస్యలపై మాట్లాడిన ఆయన, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 వేల మంది అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు గత 4050 సంవత్సరాలుగా నిరంతర సేవలు అందిస్తున్నారని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల భవిష్యత్ నిర్మాణంలో అంగన్వాడీ అక్కచెల్లెలు కీలక పాత్ర పోషిస్తున్నారని, పోషకాహారం అందించడం, గర్భిణీ స్త్రీల సంరక్షణ వంటి బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తున్నారని కొనియాడారు.సమాజానికి బలమైన పునాది వేస్తున్నారని అన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 2023 వరకు తమ జీవన స్థితి మెరుగవుతుందని, వేతనాలు పెరుగుతాయని అంగన్వాడీ సిబ్బంది ఆశించినప్పటికీ, పని భారం పెరిగినంత మాత్రాన వేతనాల్లో పెరుగుదల కనిపించలేదని పేర్కొన్నారు.గతంలో సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ సిబ్బంది సమ్మె కూడా నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమ సమస్యలు పరిష్కారమవుతాయని అంగన్వాడీ సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం అంగన్వాడీ సిబ్బందికి నెలకు రూ.18,000 వేతనం ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, రిటైర్మెంట్ అనంతరం పెన్షన్ సదుపాయం కల్పించాలని అంగన్వాడీ అక్కచెల్లెలు చేస్తున్న సేవలను గుర్తించి వారికి తగిన గౌరవం, భద్రత, సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



# ధురంధర్ ఫ్రాంచైజీపై అమీర్ ఖాన్ కామెంట్స్ వైరల్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ లీడ్ రోల్‌లో నటించిన ఫ్రాంచైజీ ధురంధర్. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ ఫ్రాంచైజీలో పార్ట్ 1 బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలువగా.. ఇప్పుడు ధురంధర్ : ది రివెంజ్ బాక్సాఫీస్ వద్ద రికార్డుల పరంపర కొనసాగిస్తోంది. ఆదిత్య ధర్ తెరకెక్కించిన సీక్వెల్ విడుదలైన కేవలం 6 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి రూ.1000 కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతోంది. ఈ చిత్రం ఇప్పటివరకు రణ్‌వీర్ సింగ్ చేసిన సినిమాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా సరికొత్త రికార్డు సృష్టించడమే కాకుండా, హిందీ చిత్ర పరిశ్రమలో నయా బెంచ్ మార్క్‌లను సెట్ చేస్తోంది. సాధారణంగా బాలీవుడ్ ఖాన్ త్రయమైన షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్‌లు ఏదైనా సినిమాపై స్పందిస్తే.. ఆ మూవీపై బజ్ అద్భుతంగా ఉంటుంది. తాజాగా ఖాన్ త్రయంలో ఒకడైన అమీర్ ఖాన్ ధురంధర్ మూవీపై చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మీడియాతో చేసిన చిట్‌చాట్‌లో ధురంధర్ ఫ్రాంచైజీ గురించి అమీర్ ఖాన్ సినిమా చూడకుండానే చెప్పిన మాటలు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతున్నాయి. 'నేనింకా సినిమా చూడలేదు.. కానీ సినిమాపై వస్తున్న ప్రశంసలను మాత్రం విన్నానన్నాడు అమీర్ ఖాన్. ధురంధర్, ఇప్పుడు ధురంధర్ 2 చాలా అద్భుతంగా స్క్రీనింగ్ అవుతున్నాయి. ధురంధర్ టీంకు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నాడు' అమీర్ ఖాన్. ఈ కామెంట్స్‌తో ఖుషీ అవుతున్న మూవీ లవర్స్ ఈ బాలీవుడ్ 'మిస్టర్ ఫర్‌ఫెక్షనిస్ట్' రెండు సినిమాలు చూసి తన అభిప్రాయాన్ని పంచుకుంటాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.